హనుమాయమ్మ గ్రంథాలయం

వసుంధర

రామకృష్ణా మిషన్ బీచ్ దగ్గర కూర్చుని సముద్రంపైపే గంభీరంగా చూస్తున్నారు శాస్త్రి, శర్మ.

"మనమేదో ఒకటి చేయాలి. ఇలా ఖాళీగా వుండిపోతే దేశానికి ప్రమాదకరంగా మారిపోతాం" అన్నాడు శాస్త్రి.

"అబ్బ! ఒక్క క్షణం మౌనంగా వుండలేవు కదా! కాసేపు నన్ను సముద్రాన్ని చూడనీ!" అన్నాడు శర్మ విసుగ్గా.

"అదేపనిగా హోరు పెడుతున్న సముద్రం నీకు విసుగనిపించటంలేదు. నా మాటలు విసుగనిపించాయా?" అన్నాడు శాస్త్రి.

"సముద్రం ప్రకృతి. ప్రకృతి అందాలు విసుగురావు."

"ఏం—మనిషి మాత్రం ప్రకృతి కాదా?"

"శాస్త్రి-నువ్వూ ప్రకృతివేనని ఒప్పుకుంటాను. నన్ను విసిగించకు."

"నేను విసుగించావంటే లోపం నా మాటలది కాదు. నీ మెదడుది. పనిలేక అది దెయ్యానికి కర్మాగారమయింది. నా మెతిలూరికే పుట్టవు. నా మాట విను. మనం మెదడుకు పదును పెట్టాలి."

శర్మ సముద్రం నుంచి దృష్టిని శాస్త్రి వైపు మళ్ళించి- "ఏమిటి నీ రొద—ఇప్పుడేం చేయాలో చెప్పు...." అన్నాడు.

"ఏదైనా మంచిపని చేయాలి...."

"మంచిపని అంటే...." అని ఓ క్షణం ఆలోచించి "పాపం ఇంటాయన కద్దె యివ్వాలి. మన దగ్గర డబ్బుందిగా యిచ్చేద్దాం" అన్నాడు శర్మ.

"అద్దె ఫస్టుకివ్వాలి. ఇంటాయనకు మనం బాకీ ఏమీ లేముగదా—ఫస్టు దాకా ఆగే యిద్దాం" అన్నాడు శాస్త్రి.

"నేను చెప్పేది ఇప్పటాయన కాదు. పాత ఇంటాయన మాట" అన్నాడు శర్మ.

"ఓహో ఇప్పుడు గతాన్నెందుకు తవ్వుతావు శర్మా! అది నేనెప్పుడో మర్చిపోయాను" అన్నాడు శాస్త్రి.

"గతమనకు నేందుకది జరిగి జస్టు టూ మంత్స్.... అంతేకదా! పాపం ఆయన బాకీ తీర్చేద్దాం"

"పాపం అని ఆయనమీద జాలిపడ్డానికి ఆయనేమన్నా మనని కనికరించాడా? రేపట్లోగా నా అద్దె బకాయి చెల్లించకపోతే ఇల్లు ఖాళీచేసిపొండి అన్నాడు. సమయానికి వేరే యిల్లు దొరక్కపోతే ఏమైపోదుం?" అన్నాడు శాస్త్రి.

"దొరికింది కాబట్టి ఖాళీచేసిపోయాం. దొరక్కపోతే ఆయన కాళ్ళు పట్టుకుందుం—ఆయన చాలా మంచివాడు.

మన సామాను కూడా ఉంచుకోలేదు."

శాస్త్రి నవ్వి "ఉంచుకుందుకు పనికొచ్చే సామాను మన దగ్గరేముంది?" అన్నాడు.

శర్మ ఆదోలా మిత్రుడివంక చూసి "నువ్వు చెప్పింది నిజం. మనకు పనిలేకపోతే దుర్మార్గులమైపోతాం. నువ్వు మన పాతయింటి యజమానిలో బొత్తిగా మంచితనాన్ని చూడలేకపోతున్నావు పద....ముందాయనకు పాతబాకీ తీర్చివద్దాం" అన్నాడు.

"పాతబాకీ తీర్చితే మనదగ్గర డబ్బు కరిగిపోతుంది."

"కరిగిపోతే మెదడు పదును పెడుతుంది. సానపెట్టిన వజ్రానికి ఎప్పుడైనా మంచి ధర పలుకుతుంది. ఊరికే కూర్చుని ఉన్నదనుభవించడం మన కచ్చిరాదులే...." అంటూ తను లేచి నిలబడి స్నేహితుణ్ని రెక్కపుచ్చుకుని లేపాడు శర్మ.

శాస్త్రి లేచి నిలబడి "నువ్వు చెప్పింది బాగానే వుంది కానీ అంత సులువుగా డబ్బివ్వడానికి నేనొప్పుకోను. బయల్దేరగానే మనకు శుభసూచన కనబడాలి" అన్నాడు.

"సరే" అన్నాడు శర్మ.

ఇద్దరూ వీధిరోడ్డు మీదకు వచ్చారు.

"ఇప్పుడెటు వెళ్ళాలి?" అన్నాడు శాస్త్రి.

"ఏం—ఆ యిల్లు నీకు తెలియనిదా?" అన్నాడు శర్మ చిరాగ్గా.

"చెప్పానుగా—ఆయన గురించి పూర్తిగా మర్చిపోయానని!"

"మర్చిపోయానంటే కుదరదు. గుర్తు చేసుకోవలసిందే"

ఉన్నట్టుండి "అటుపోదాం" అన్నాడు శాస్త్రి.

"బాగానే గుర్తుకు తెచ్చుకున్నావు" అన్నాడు శర్మ మెచ్చుకోలుగా.

శాస్త్రి మాట్లాడలేదు. ఇద్దరూ అటువైపుగా నడక సాగారు. నడుస్తూంటే శర్మ—ఇంటివాళ్ళ బాకీలు తీర్చడంలోని ప్రయోజనాల గురించి చెబుతున్నాడు.

"నీ కబుర్లు కట్టిపెట్టి కాస్త ముందుకు చూడు. ఇందాకా నువ్వు చూసిన సముద్రం కంటే అందమైన ప్రకృతి కనబడుతుంది" అన్నాడు శాస్త్రి.

శర్మ ముందుకు తీక్షణంగా చూసి "అరె" అన్నాడు.

చిత్రకారుడు గీసిన గీతల్లా వున్నదామె శరీరం. ఆ శరీరానికి చక్కగా అమరినట్టు కట్టుకున్న చీర. రెండు జడలు లయబద్ధంగా నడకకు కదుల్తున్న ఆమె పిరుదలపై నాట్యం చేస్తున్నాయి.

ఆమె ముందు నడుస్తోంది.

శాస్త్రి, శర్మ ఆమె ననుసరించి వెడుతున్నారు.

"చూశావా ప్రకృతి అంటే ఇలాంటివి చూడాలి!" అన్నాడు శాస్త్రి.

"వెతకబోయిన తీగ కాలికి తగిలింది" అన్నాడు శర్మ.

"ఉత్తతీగ అనకు. మెరుపుతీగ అను" అన్నాడు శాస్త్రి.

"మన పాతయింటి యజమానిని మెరుపుతీగ అనమన్నావంటే నీవు చాలా మంచివాడివై పోయావు. ఇది శుభసూచన" అన్నాడు శర్మ.

"మధ్య ఇప్పుడాయన ప్రసక్తి ఎందుకు?" అన్నాడు శాస్త్రి చిరాగ్గా.

"డబ్బివ్వాలని బయల్దేరాం. అందుకంచు కాయసే

ఎదురొస్తున్నాడు. నీ కింకా కనబడలేదా?" అన్నాడు శర్మ.

శాస్త్రి ఉలిక్కిపడి "నిజంగానా?" అన్నాడు.

"అదిగో చూడు!" అన్నాడు శర్మ.

"అయితే ఆయన కన్నకనబడకుండా దాక్కోవాలి"

"అది డబ్బులేనప్పుడు చేసేపని. అలవాటులో పొరపాటంటే యిదేనేమో! ఇప్పుడు మనం ధైర్యంగా దర్జాగా ఆయనముందు నిలబడొచ్చు."

"ధైర్యంగా దర్జాగా ఆయన ముందు నిలబడాలని నాకేమీ సరదాగాలేదు. ఆయన రాజకీయ నాయకుడూ కాడు, శ్రీదేవిలాంటి గ్లామర్ తారా కాడు."

"అయితే ఏమంటావ్?"

"దాక్కుందాం...."

ఎందుకో ముందు నడుస్తున్న అమ్మాయి ఆగింది. ఆమె కెదురుగా వస్తున్న ఇంటాయనా ఆగాడు.

ఆమె ఆయన్ను పైనుడిగింది.

ఆయన చెప్పి అక్కడే వుండిపోయాడు.

"పద ఆయనకు డబ్బిచ్చేద్దాం" అన్నాడు శర్మ.

"అబ్బా దాక్కుందామంటే!" అన్నాడు శాస్త్రి.

"చూడు—అన్నీ శుభసూచనలు కనబడితే ఆయన బాకీ తీర్చేద్దామని అన్నావు. నీకో అందమైన అమ్మాయి కనబడింది. ఆయనింటికి వెళ్ళే శ్రమలేకుండా తనే ఎదురొచ్చాడు" అన్నాడు శర్మ.

"సరే—అందమైన అమ్మాయి వెంటబడిపోతున్నప్పుడు ఇంటాయన ఎదురవడం శుభసూచ నెలాగౌతుంది? అదీకాక ఇంటాయన కిక్కడ డబ్బు లివ్వడంవల్ల మనకేం లాభం? వాళ్ళావిడ సంగతి నీకు తెలిసిందే కదా!

ఆమెకు భయపడే ఆయన మనని అద్దెకోసం పీడించేవాడు. ఆయనకు పెళ్ళామంటే చచ్చేంత భయం. ఇప్పుడు మనం డబ్బిచ్చినా ఆయన పెళ్ళానికి చెప్పకుండా పాకెట్ మనీ కింద దాచుకుంటాడు. ఆతర్వాత అవి డెప్పుడైనా ఎదురయిందంటే మన ప్రాణాలు తీస్తుంది. విధం చెడ్డా ఫలం దక్కాలి. బాకీ తీర్చినా ఆవిడ బాధ వదలకపోతే అందువల్ల మనకు ప్రయోజనమేమిటి?"

"అయితే ఏమంటావ్?" అన్నాడు శర్మ విసుగ్గా.

"ఇప్పుడాయ నింటికి వెడదాం."

"డబ్బావిడ కిచ్చేద్దామా?"

శాస్త్రి కోపంగా మిత్రుడివంక చూసి "ఆయన పెళ్ళానికి బానిస కావచ్చు. అంతమాత్రాన ఇంటద్దె ఆవిడ కిచ్చి ఆయన్నవమానించలేను. ఆ యింటికి ఆయనే యజమాని. నే నాయన్ను గౌరవిస్తాను. ఆయనకే బాకీ తీరుస్తాను" అన్నాడు.

"మీరాయిన యింటిదగ్గర వుండడు కదా!" అన్నాడు శర్మ.

"ఆయనున్నాడా అనడిగి లేదంటే వెళ్ళిపోదాం."

"ఆవిడంత సులభంగా వదులుతుందా? ఒకసారి కళ్ళబడ్డామంటే పురాణం విప్పుతుంది. తీరికూర్చుని ఆవిడ కళ్ళ బడడ మెందుకూ?"

"అదే నేనూ చెబుతున్నాను. కానీ నువ్వే పట్టుబడుతున్నావు "

శర్మ తెల్లబోయి మిత్రుడివంక చూశాడు.

ఈలోగా ఇంటాయన ఆమెను దాటుకుని ముందుకు వచ్చాడు. మిత్రులిద్దరికీ తప్పుకునే సమయం లేకపోయింది.

శర్మ జేబులో చేయి పెట్టాడు. శాస్త్రి నమస్కారం

పెట్టడానికి సిద్ధంగా వున్నాడు.

అయితే ఇ టాయన వీరివంక చూడలేదు.

ఆయన ఉత్సాహంగా తనలో తనే నవ్వుకుంటూ ముందుకు వెళ్ళిపోయాడు.

"చాలా ఆశ్చర్యం! ఒకప్పుడు మన వాసన పసిగట్టి వచ్చేసేవాడు. ఇప్పుడెదురుగా కనబడ్డా గుర్తుపట్టలేదు!" అన్నాడు శర్మ ఆశ్చర్యంగా.

"ఇందులో ఆశ్చర్యమేముంది! అంతా ప్రకృతి మహిమ. మనం వెంటబడ్డ ఆ అమ్మాయి చాలా అందంగా వుండివుంటుంది. ఆమె పలకరించి చెయ్యిడిగి నాలుగు కబుర్లు చెప్పేసరికి గురుడికి మతి, గతి తప్పినట్లుంది. అయ్యన్ని అంతలా మరిపించిన ఆ అమ్మాయిని మనం చూడక తప్పదు. ముఖం చూద్దాం—పద!" అన్నాడు శాస్త్రి.

శర్మ మాట్లాడలేదు.

మిత్రులిద్దరూ వేగంగా అడుగులు వేస్తూ ఆమెను దాటుకుని వెళ్ళి ఓసారి వెనక్కి తిరిగి చూసి చటుక్కున ముందుకు ముఖం తిప్పేశారు.

అమ్మాయి అందమైందే—కానీ....

"బాడ్ లక్! మనకు బాగా తెలిసిన అమ్మాయి" అన్నాడు శర్మ.

"ఆ పాతింటాయన కనబడ్డప్పుడే అనుకున్నాను. వెధవ శకునం" అంటూ నిట్టూర్చాడు శాస్త్రి.

ఈలోగా వెనుకనుంచి "ఏమండోయ్!" అన్న కేక వినబడింది.

ఆ కేక తమను కాదన్నట్లుగా ముందడుగు వేశారు మిత్రులు.

"శాస్త్రి గారూ! మిమ్మల్నే—ఆగండి...." అందా అమ్మాయి మళ్ళీ.

"శర్మా ఆమె నన్నాగమంటోంది. నువ్వు నడుస్తూండు. నే నిప్పుడే ఆమెతో మాట్లాడి వస్తాను" అన్నాడు శాస్త్రి.

"నాకు కాళ్ళు లాగుతున్నాయి. కాసేపిక్కడే నిలబడతాను" అన్నాడు శర్మ మొండిగా.

"విధవ శకునం వచ్చింది. నీ వంటి బుద్ధిమంతులు కూడా తిరగబడుతున్నారు. ఎరిగున్నమ్మాయిని పలకరిస్తే బాగుండదని తటపటాయిస్తే వెరికిబోయిన తీగ కాలి కెదురైనట్లు ఆమే నన్ను పిలిచింది. కానీ ఏం లాభం.... నువ్వు పక్కనుండగా నే ఆమెతో మాట్లాడాలి" అన్నాడు శాస్త్రి.

శర్మ ఉలిక్కకుండా మొండిగా అలాగే నిలబడ్డాడు.

ఈలోగా ఆ అమ్మాయి వారిద్దర్నీ సమీపించింది.

శాస్త్రి ఆమె ఎవరో ఎరుగనట్లు చూశాడు.

"నేనండీ మీ ఎదురింటి అమ్మాయిని. నా పేరు శశిరేఖ" అందామె తన్ను తా నతడికి పరిచయం చేసుకుంటూ.

"అలాగా" అన్నాడు శాస్త్రి ఇబ్బందిగా.

ఆమె కొద్దిగా చిన్నబుచ్చుకుని "శాస్త్రిగారు నన్ను చాలాసార్లు చూశారు. మీకు గుర్తు లేకపోయినా వారికి నేను గుర్తుంటాను" అంటూ శర్మవైపు తిరిగి "శాస్త్రిగారూ! మీతో నే నాకు పనుంది" అంది.

"నా పేరు శర్మ. శాస్త్రి ఆతడు" అన్నాడు శర్మ.

"ఓహో—మీ యిద్దరిలో ఒకరు శాస్త్రి, ఒకరు శర్మ అని తెలుసు. ఎవరు శాస్త్రో, ఎవరు శర్మో తెలియదు.

అయాంసారీ శర్మగారూ!" అందామె.

శర్మ గంభీరంగా "శాస్త్రీ! కాసేపలా పక్కకు వెళ్ళు. మేమిద్దరం మాట్లాడుకోవాలి" అన్నాడు వెంటనే.

శాస్త్రి ముఖం చిన్నబోయినా "చాలా అర్జంటు పనిమీద వెడుతూ మీరు పిల్చారని ఆగాను...." అని తన మాటలు తనకే అసందర్భంగా తోచి ఆగిపోయాడు.

"ఫరవాలేదు. ఆయనకూడా వుండొచ్చు—" అంది శశిరేఖ.

"సరే....నువ్వూ వుండు—" అన్నాడు శర్మ తన అనుమతిని తెలుపుతూ.

"మనం అలా ఇసుకలో కూర్చుని మాట్లాడుకుందాం" అందామె.

బీచి—ఆడపిల్ల ....

శాస్త్రి మనసులో ఉత్సాహపడ్డాడు. శర్మ మాత్రం గంభీరంగా—"పదండి—" అన్నాడు.

ముగ్గురూ సముద్ర కెరటాలకు దూరంగా ఇసుకలో కూర్చున్నారు.

"నా అదృష్టం—వెతకబోయిన తీగ కాలికి తగిలింది" అంది శశిరేఖ.

"మీకు తీగ తెలుసుకానీ తీగ పేరు తెలియదు—" అన్నాడు శాస్త్రి.

"తీగ పేరుతో నాకేమి నిమిత్తం. నాక్కావలసింది పువ్వు—" అంది శశిరేఖ.

"పువ్వా?" అన్నాడు శర్మ ఆశ్చర్యంగా.

శాస్త్రి ఓసారి చెవులు తడుముకొని—"నా దగ్గర పువ్వుల్లేవు—" అన్నాడు.

"గుమ్మడికాయల దొంగలంటే భుజాలు తడుము
కున్నట్టే పువ్వనగానే చెవులు తడుముకునే వాళ్లూ వుంటా
రన్నమాట! అయినా నేను పువ్వడిగింది మిమ్మల్ని కాదు.
శాస్త్రి గారిని—" అంటూ శశిరేఖ శర్మ వంక చూసింది.

"నేను శర్మను. శాస్త్రిని కాను...." అన్నాడు శర్మ
అదోలా.

"ఏమిటో—మిమ్మల్ని చూడగానే మీ పేరు శాస్త్రి
అనిపిస్తోంది...."

శాస్త్రి కలగజేసుకొని—"శాస్త్రి అంటే పిలవ
డానికి ముద్దుగా వుంటుంది. శర్మంటే అదేం కర్మరా
బాబూ అనిపిస్తుంది" అన్నాడు.

శర్మ వెంటనే—"ముద్దుగా వుండే పేరు నాకేతప్ప
నీకు నప్పదని శశిరేఖగారి అభిప్రాయం—" అన్నాడు

"బాగా చెప్పారు. పువ్వు మీ దగ్గరుంది గాబట్టి
బాగా చెప్పగలగడం మీకు సాధ్యపడింది—" అంది
శశిరేఖ.

శర్మ తనూ అప్రయత్నంగా చెవులు తడుముకొని—
"పువ్వు నా దగ్గరుండడమేమిటి?" అన్నాడు.

"పువ్వంటే మీకర్థమైనట్టు లేదు. అది కిరణ్మయి నవల.
మహోద్భుతమైన నవల—" అంది శశిరేఖ.

"అయ్యో—మీరు నవలల గురించి మాట్లాడుతు
న్నారా? నేను నవలలు చదవను. అందులోనూ తెలుగువి
అసలే చదవను—" అన్నాడు శర్మ.

"కానీ ఆ నవల నేను మీ చేతిలోనే చూశాను...."
అంది శశిరేఖ.

"ఎప్పుడు?" అన్నాడు శర్మ ఆశ్చర్యంగా.

"సరిగ్గా రెండ్రోజుల క్రితం...." అందామె.

"అసాధ్యం—" అన్నాడు శర్మ.

"నేను కళ్ళతో చూసిన విశేషం అసాధ్యమంటా వేమిటి?"

"ఒకొక్కప్పుడు మన కళ్ళే మనని మోసం చేస్తాయి-"

"నా కళ్ళు ఎన్నెప్పుడూ మోసం చేయవు...."

"మోసం చేయకపోతే నా చేతిలో పువ్వులెలా మారాయి?"

"శర్మా! ఆమెతో వాదించకు. ఆమె చెప్పింది రైటు" అన్నాడు శాస్త్రి.

"నిన్నెవ్వరూ సలహా అడగలేదు. నా తప్పొప్పులు నాకు తెలుసు...."

శాస్త్రి గంభీరంగా చూస్తూ—"ఇక్కడ నేను కూడా వుండడం మంచిదయింది. లేకపోతే ఒక నిజం అబద్ధంగా మారిపోయుండేది—" అన్నాడు.

"ఇది పువ్వులోని రైలాగు. మీ కెలా తెలుసు?" అంది శశిరేఖ.

"ఎలా తెలుసంటే—నే నా నవల చదివాను కాబట్టి. కిరణ్మయి నా అభిమాన రచయిత్రి—...." అన్నాడు శాస్త్రి.

"కిరణ్మయి ఆడది కాదు—మగాడు...." అందామె వెంటనే.

"నాకు తెలుసు. అయినా అతడు నా అభిమాన రచయిత్రి—"

"వాక్యంలో ఏదో తప్పున్నట్లుంది—" అన్నాడు శర్మ.

"మగాళ్ళాడపేర్లతో కథలు రాస్తే వ్యాకరణం తప్పులు తప్పవు కానీ—నువ్వు కాసేపు నోరు మూసుకుని

నన్ను మాట్లాడనీ. లేకపోతే ఒక నిజం అబద్ధంగా మారి పోతుంది—" అన్నాడు శాస్త్రి.

"మీరు నవలలు చదువుతారా?" అంది శశిరేఖ.

"చదువుతాను. అందులోనూ తెలుగువి. మళ్ళీ అందులో యెక్కువగా కిరణ్మయివి చదువుతాను...."

"మీ అభిరుచి నాకు నచ్చింది. నేను మిమ్మల్నే శాస్త్రి అని పిలుస్తాను—" అంది శశిరేఖ.

"అందులో విశేషమేముంది? నేను నిజంగా నే శాస్త్రిని!"

"మనిషి గుర్తింపుకోసం పేరు పెట్టుకుంటాడు. కానీ పేరువల్ల అందరికీ గుర్తింపురాదు. నానోట పలికిన ప్రతి పేరూ మనిషికి గుర్తింపు తెచ్చింది—" అంది శశిరేఖ.

"ఇదికూడా పువ్వులోని డైలాగే—" అన్నాడు శాస్త్రి.

"మీరు నిజంగానే ఆ నవల శ్రద్ధగా చదివారు. మిమ్మల్ని తప్పకుండా శాస్త్రి అని పిలవాలి—" అంది శశిరేఖ.

"నా పేరుతో నన్ను పిలవడమే ఒక ఫావర్ అన్నట్లు మాట్లాడుతుందేమిటి?" అనుకుంటూనే— "ఇంతకీ మీరు నన్నెందుకు పిలవాలనుకుంటున్నారు?" అన్నాడు శాస్త్రి.

"ఏది నా అడగాలనుకుంటే మనిషిని పిలవాలికదా!"

"ఏమడగాలనుకుంటున్నారు?"

"పువ్వు...."

"పువ్వు మీరు చదివేశారుగా!"

"చదివితే మళ్ళీ చదవకూడదా?" అందామె.

"ఒకో నవల విడివిడిగా ఒకేసారి చదువుతూనే

పాఠకులు చెడిపోతున్నారు. అలాంటి దొంకే నవల రెండేసి సార్లు చదివితే పాఠకులు తాము చెడిపోవడమేకాక తమ స్నేహితుల్నికూడా చెడగొట్టేస్తారు—" అన్నాడు శర్మ.

"శర్మా! నువ్వు చెడ్డావేమో—ముందు చెప్పు...."

"నేను నవలలు చదవను కాబట్టి చెడిపోయే అవకాశం లేదు నాకు—"

"అది కాదులే—నేను పువ్వు రెండు కాదు—మూడు సార్లు చదివాను. అందువల్ల నా మిత్రుడిగా నువ్వేమైనా చెడిపోయావా అనడుగుతున్నాను...."

శశిరేఖ చప్పట్లు కొట్టి—"మీ తెలివి అద్భుతం. నేను మిమ్మల్నే శాస్త్రి అని పిలుస్తాను—" అంది.

శాస్త్రి విసుగును మనసులోనే దాచుకొని—"పువ్వు నా దగ్గర లేదు—" అన్నాడు.

"మరెవరి దగ్గరుంది?"

"అది చెప్పి లాభంలేదు. మీరా పుస్తకం లైబ్రరీ నుంచి తెచ్చుకోండి—" అన్నాడు శాస్త్రి.

"అయ్యో! మీమీద కొండంత ఆశలు పెట్టుకున్నానే! వెతకబోయిన తీగ కాలికి తగులుతుందనుకున్నానే!" అంది శశిరేఖ బాధగా.

"పోనీ—నేను లైబ్రరీకి వెళ్ళి ఆ పుస్తకం తెచ్చి పెట్టనా?" అన్నాడు శాస్త్రి.

"అయ్యో! అది లైబ్రరీలో వుండదు. నలుగురూ చదివే పుస్తకాలు లైబ్రరీల్లో కొనరని మీకు తెలియదా?"

"అయితే రెంటెడ్ షాపునుంచి తెచ్చిపెట్టనా?"

"కిరణ్మయి రాసేవి చౌకబారు నవలలు కావు—రెంటెడ్ షాపునుంచి తెచ్చిపెట్టడానికి...." అన్నది

శశిరేఖ.

"నేను తెస్తానుగా—...." అన్నాడు శాస్త్రి.

"అంటే కిరణ్మయి చౌకబారు నవల్లు రాస్తుందని యిలావు చేస్తానంటారు. నాకు మీ దగ్గరున్న పుస్తకమే కావాలి...."

"చదువుకుందుకేదైతేనేం?" అన్నాడు శాస్త్రి.

"ఉత్తమ గ్రంథాల నుత్తమ సంస్కారం కలవారి దగ్గరే తెచ్చుకొని చదవాలి—" అంది శశిరేఖ.

శాస్త్రికి ఛాతీ ఉబ్బింది—"మీకసలు నా దగ్గరా పుస్తకమున్నదని ఎలా తెలుసు?"

"ఈ ఊళ్ళో ఆ నవల దొరకలేదు. ఉన్నవాళ్ళివ్వడం లేదు పోతుందన్న భయంతో! పబ్లిషర్సుకి రాస్తే పది కాపీలు ఆర్డరిచ్చినవారికే పుస్తకం పంపుతామంటున్నారు. నాతోపాటు అయిదారుగురు స్నేహితురాండ్రీ పుస్తకం కోసం ప్రయత్నిస్తున్నారు. ఆ సమయంలో రెండ్రోజుల క్రితం మీ స్నేహితుడి చేతిలో ఆ నవల చూశాను. అప్పుడు నేను మా యింటరుగుమీద వున్నాను. ఎంత దూరాన్నుంచైనా పువ్వును అట్ట చూసి గుర్తుపట్టేయగలను. పరుగున వచ్చి అడుగుదామంటే అమ్మ పక్కవర్చిలోనే వుంది. అదీకాక మీరిద్దరూ హడావుడిగా వెళ్ళిపోతున్నారు...." ఆగిందామె.

"నాకు గుర్తొచ్చింది. నవల ధోరణిలో పడి నా మిత్రుడు ముఖ్య విషయాలేమీ పట్టించుకోకపోతే ఒళ్ళు మండి నవలను సముద్రంలో విసిరిపారేస్తానని బయల్దేరాను...."

"అప్పుడు నేను నవల నాలుగోసారి చదువుతున్నాను. నవలను కాపాడుకుందుకు నా మిత్రుణ్ణనుసరించాను—"

అన్నాడు శాస్త్రి.

"పువ్వుని పుస్తకాల్లో పెట్టి దాచుకోవాలిగానీ సముద్రంలోకి విసురుతుంటారా — ఎవరైనా?" అంది శశిరేఖ కోపంగా.

"నేను విసురుతుంటాను—" అన్నాడు శర్మ

"శాస్త్రిగారూ — మీరు పుస్తకాన్ని కాపాడుకున్నారా?" అంది శశిరేఖ

"కాపాడుకోలేకపోయాను...." అన్నాడు శాస్త్రి.

శశిరేఖ ముఖం ఎర్రబడింది—"అంత మంచి పుస్తకాన్ని సముద్రంపాలు చేసినవాణ్ణి, అలా చేస్తుండగా చూస్తూ ఊరుకున్నవాణ్ణి కూడా నేను క్షమించలేను—"

"మీ క్షమను కోరేవారిక్కడెవ్వరూ లేరు—" అన్నాడు శర్మ.

"నేనున్నాను—" అన్నాడు శాస్త్రి—"శశిరేఖగారూ! ఆ పుస్తకం సముద్రంలో పడకుండా నా ప్రాణాలకు తెగించి పోరాడాలనుకున్నాను. కానీ విధి బలీయం. అప్పుడే దారిలో మాకు హనుమాయమ్మగారెదురైంది-"

"హనుమాయమ్మగారంటే—పక్క వీధిలో ఉండే ఆమేనా?" అంది శశిరేఖ.

శాస్త్రి ఆమె ముఖంలోని నిరుత్సాహాన్ని చదువుతూ "అవును. ఆవిడే! ఆవిడ శర్మ చేతిలోని పువ్వును చూసి—బాబూ—ఒక్కసారి చదివిచ్చేస్తా—నాక్కావాలి—అనడిగి తీసుకుంది. సముద్రంలోకి విసరడంకంటే ఆవిడకివ్వడంవల్లనే తన లక్ష్యం నెరవేరుతుందని గ్రహించి శర్మ వెంటనే ఆ పుస్తకాన్నావిడకిచ్చేశాడు—" అన్నాడు.

"గోడకు వేసిన సున్నమైనా తిరిగిరావచ్చుకానీ హనుమాయమ్మగారిల్లు చేరిన పుస్తకం వెనక్కురాదు-" అన్నాడు శర్మ కసిగా.

"అయ్యో! అనవసరంగా మిమ్మల్ని శాస్త్రి అని పిలిచానే—" అంది శశిరేఖ.

"అనవసరమేమిటి? అదే నా పేరు...." అన్నాడు శాస్త్రి.

"శాస్త్రిగారూ — అంతమంచి పేరు పెట్టుకున్న మీరు నాకోసం హనుమాయమ్మగారింటినుంచి పువ్వు తెచ్చిపెట్టలేరా?" అంది శశిరేఖ.

శాస్త్రికి ఛాతీ మరింత ఉబ్బినా హనుమాయమ్మను గురుకు తెచ్చుకొని మాటిచ్చే ధైర్యం చేయలేకపోయాడు.

"శాస్త్రిగారూ — మాటివ్వండి ప్లీజ్—" అంది శశిరేఖ.

"నిలబెట్టుకోలేని మాటిచ్చి ప్రయోజనమేముంది?" అన్నాడు శాస్త్రి నిస్పృహగా.

"నాకోసం మాటిస్తే మీరు తప్పకుండా నిలబెట్టుకో గలుగుతారు. ఎదురింటి అమ్మాయిని. ముద్దుగా అడుగుతున్నాను. కాదనకండి—" అంది శశిరేఖ.

"ఇదీ పువ్వులోని డైలాగేనా?" అన్నాడు శర్మ చిరాగ్గా.

"బాగా ఊహించారే—" అంది శశిరేఖ మెప్పుకోలుగా.

2

శశిరేఖ వెళ్ళిపోగానే — "నువ్వాశే యేమిటో అనుకున్నాను. మన పాతి:టాయనది నిజంగానే మా బిడ్డ శకునం. ఈపిల్లెవరూ మహాజిడ్డులా పట్టుకుని బోరు కొట్టే

సింది—" అన్నాడు శర్మ.

"అందమైన ఆడపిల్లను బోగసడం మన వయసుకు తగదు. పలకరించడానికే భయంవేసేది. అలాంటిదాంత నేపు కబుర్లు చెప్పుకున్నాం—మైము గంటలు సెకన్లలా గడిచిపోయాయి...." అన్నాడు శాస్త్రి.

"పుస్తకం తెచ్చిస్తానని ఆమెకు మాటిచ్చావు. ఏం చేస్తావు—ఎలా సాధిస్తావు?" అన్నాడు శర్మ.

"గొప్పవాళ్ళు స్వయంగా ఏదీ చేయరు. రాముడికి హనుమంతుడున్నట్లు నువ్వు నాకున్నావుగా" అన్నాడు శాస్త్రి.

"నేను నీకు సాయపడను—" అన్నాడు శర్మ.

"ఎందుచేత?"

"నన్ను హేళన చేసిన పిల్లకు నావల్ల ప్రయోజనం కలక్కూడదు. నా శత్రువుకు చేయవకావాలనుకు నే నీకూ సాయపడను—...."

"నిస్వార్థంగా స్నేహితుడికి సాయపడలేవా?"

"శాస్త్రీ—షటప్!" అంటూ శర్మ కోపంగా లేచి నిలబడ్డాడు.

"అయితే నువ్వెళ్ళు. నేను నా పని సానుకూలం చేసుకున్నాకే మళ్ళీ మనం కలుసుకుంటాం-" అన్నాడు శాస్త్రి.

"అంటే ఒకమ్మాయి గురించి మనం విడిపోతున్నాం" అన్నాడు శర్మ.

"కాదు—ఒక స్వార్థపరుడి కారణంగా-" అన్నాడు శాస్త్రి.

"నువ్వు స్వార్థపరుడివన్న విషయం నీ కెప్పట్నించి తెలిసింది?"

శాస్త్రి మాట్లాడలేదు. అతడు పుష్పా, హనుమాయమ్మ గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"శాస్త్రి! పుస్తకాలు చదవడం మంచిదే.... కానీ అది వ్యసనంగా పరిణమించకూడదు. నువ్వు చదువుతున్న నవలలు నిన్ను వ్యసనపరుడిగా మార్చుతూంటే చూడలేక పోతున్నాను. అందుకే హెచ్చరిస్తున్నాను. పుస్తకాల వ్యసనంలోపడ్డ పిల్లతో స్నేహంకూడా మంచిదికాదు. నా మాట విను...." అన్నాడు శర్మ.

"వినను—" అన్నాడు శాస్త్రి.

"అయితే నేను వెళుతున్నాను ..."

"నీ యిష్టం—...."

శాస్త్రి చూస్తూండగా శర్మ వెళ్ళిపోయాడు. కాసేపు శూన్యంలోకి చూసి తనూ లేచి నిలబడ్డాడు. ఏదో నిర్ణయానికి వచ్చినవాడిలా అతడు చకచకా అడుగులు వేశాడు.

కాసేపటికి హనుమాయమ్మ ఇంటిముందున్నాడు.

హనుమాయమ్మది చాలా పెద్ద యిల్లు.

పురాతనకాలపు ఇల్లది.

అందులో ఓ పెద్ద హాలుంటుంది. చుట్టూ పదహారు చిన్న చిన్న గదులుంటాయి.

అంతింట్లోనూ ఆమె ఒక్కర్తే ఉంటోంది.

ఆమె వయసు యాభైకీ అరవైకీ మధ్య ఉంటుంది. ఆమెకు భర్త వదిలిన ఆస్తి బాగా వుంది.

ఇంటి చుట్టూ తోట ఉంది. ఆ తోటను చూడ్డానికిద్దరు మాలులున్నారు. ఇల్లు రోజూ శుభ్రంచేసి వెళ్ళడానికిద్దరు పనివాళ్ళున్నారు.

హనుమాయమ్మ తన వంట తనే చూసుకుంటుంది.

హనుమాయమ్మ ప్రత్యేకత యేమిటంటే-ఆమె ఇంట్లో దొరకని తెలుగుపుస్తకముండదు. వచ్చిన ప్రతి నవలా ఆమె కొంటుంది. ఈ రోజుల్లో వస్తున్న నవలలన్నీ అన్ని కాదు. అంటే ఆమె యింట్లో యెంత పెద్ద గ్రంథాలయ ముంటుందో ఊహించవచ్చు. ఆమె పుస్తకాలు కొంటుంది. సేకరిస్తుంది. తను ఇతరులనుంచి తీసుకున్న పుస్తకం తిరిగివ్వదు. పొరపాటునకూడా ఇతరులకు తన పుస్తకం ఇవ్వదు.

తనింటికి వచ్చిన వారిని పుస్తకాలు చదవనిస్తుందని శాస్త్రి విన్నాడు.

ఆమెకు డబ్బుంది. పుస్తకాలు కొనే అలవాటుంది. అయినా ఇలా ఎందుకు ఇతరుల పుస్తకాలు కాజేస్తుందో శాస్త్రికి అర్థంకాలేదు. చెప్పాలంటే శాస్త్రి ఆమె అలవాటుని గురించి పెద్దగా పట్టించుకోలేదు. అతడింతకంటే పెద్ద సమస్యల గురించి ఆలోచిస్తున్నాడు. ఇప్పుడైనా అందమైన శశిరేఖ ముద్దుగా అడిగింది కాబట్టి హనుమాయమ్మ గురించిన ఆలోచన వచ్చింది కానీ— లేకుంటే ...

శాస్త్రి హనుమాయమ్మ యింటి గేటుతీసి లోపలకు వచ్చి మళ్ళీ గేటు వేసేశాడు. చకచకా అడుగులు వేసుకుంటూ ముందుకు వెళ్ళాడు.

"ఎవరూ?" అన్న కేక వినిపించి అటు చూశాడు.

తోటలో కూర్చుని ఉంది ఓ కుర్చీలో హనుమాయమ్మ. ఆమెకెదురుగా ఓ ఖాళీ కుర్చీ ఉంది.

శాస్త్రి ఆమెను సమీపించి—"నా పేరు శాస్త్రి!" అన్నాడు.

"కూర్చో!" అందామె.

"ఈ సమయంలో మీరు ఖాళీగా ఉంటారనుకోలేదు. ఏదో పుస్తకం చదువుతూంటారనుకున్నాను —" అన్నాడు శాస్త్రి.

"నేను పుస్తకాలు చదవను-" అంది హనుమాయమ్మ.

"మీ ఇంట్లో చాలా పుస్తకాలున్నాయని విన్నాను" అన్నాడు శాస్త్రి.

"నువ్వెందుకొచ్చావు?" అంది హనుమాయమ్మ.

శాస్త్రి వెంటనే— "నా పుస్తకం ఒకటి మీరు తీసుకున్నారు—" అన్నాడు.

"ఆ పుస్తకం నువ్వు చదివేశావా?" అంది హనుమాయమ్మ.

"ఊఁ."

"అయితే ఇంకా నీకు దాంతో పనేమిటి?"

శాస్త్రి తడుముకోకుండా— "మరోసారి చదవాలి-" అన్నాడు.

"అయితే ఇక్కడే కూర్చో—" అంటూ హనుమాయమ్మ లోపలకు వెళ్ళి కాసేపట్లో వెనక్కు వచ్చి— "నాతో పద—" అంది.

ఇద్దరూ లోపలకు వెళ్ళారు.

హనుమాయమ్మ అతడినో గదిలోకి తీసుకుని వెళ్ళింది.

ఆ గదిలో—

ఓ కుర్చీ— ....

కుర్చీ ముందోక బల్ల ....

బల్లపైన అద్దపు చట్రం బిగించి వుంది. లోపల ట్యూబ్ లైటు వెలుగుతోంది. ఆ చట్రంలోనే ఓ పుస్తకముంది.

"చదువుకో— పేజీలు తిప్పాలనుకుంటే బల్లకింద నీ

చేయి పట్టేటంత కన్నముంది...." అంది హానుమాయమ్మ.

శాస్త్రి ఆశ్చర్యంగా ఆ ఏర్పాటు చూశాడు. తను పుస్తకం చదవగలడు కానీ అక్కణ్ణించి తీసుకుని వెళ్ళలేడు.

వెళ్ళిచూస్తే—ఆ నవల పువ్వు!

"మీకు బాగా గుర్తుందే! నా దగ్గర తీసుకున్న నవల యిదే!" అన్నాడు శాస్త్రి.

"పుస్తకాలు చదవనివాళ్ళెప్పుడూ మంచి జ్ఞాపక శక్తిని కలిగి ఉంటారు. తెలివి కూడా వారిదే ఎక్కువ-" అంది హానుమాయమ్మ.

"నా పుస్తకం నాకు వెనక్కు కావాలి-" అన్నాడు శాస్త్రి.

"ఎప్పుడు కావాలంటే అప్పుడు వచ్చి చదువుకో— నీ పుస్తకమిక్కడే ఎక్కువగా సద్వినియోగమవుతుంది" అంది హానుమాయమ్మ.

"నా పుస్తకం నా యింట్లో ఉండాలి—"

"అయితే ఇంకోటి కనుక్కో—"

"ఇది నేను కొనుక్కున్న పుస్తకమే—" అన్నాడు శాస్త్రి.

హానుమాయమ్మ నవ్వి-"ఇది నువ్వు కొనుక్కున్నప్పటికీ నీ చేయి దాటిపోయింది. పుస్తకం వనితా విత్తం పర హస్తం గతం గతః—" అంది.

"నేనిప్పుడిక్కణ్ణించి ఈ పుస్తకం తీసుకొని పోగలను—"

"అప్పుడు నేను పోలీసు రిపోర్టిస్తాను—"

"ఏమని?"

"నా పుస్తకం నువ్వు తీసుకుపోయావని!"

"అందుకు సాక్ష్యాలు?"

"సాక్ష్యాలు కదలకుండా నువ్వు పుస్తకం తీసుకెళ్ళలేవు—" అంది హనుమాయమ్మ గంభీరంగా.

"అది కాదు—నేనీ పుస్తకాన్ని మీకిచ్చానని చెబుతాను—"

"తెలిసిన వారెవ్వరూ వాళ్ళ పుస్తకాలివ్వరు. నువ్వు నాకు తెలిసినవాడివి. కోర్టులో ఈ రెండూ నిరూపించబడుతాయి. నువ్వే ఓడిపోతావు—"

హనుమాయమ్మ చాలా మొండిదని శాస్త్రికి అర్థమయింది.

"ఏమైనాసరే—నాకీ పుస్తకం కావాలి—" అన్నాడతడు.

"ఎందుకో చెప్పు. నీ సమస్య తీరే ఉపాయం చెబుతాను—"

"నా పుస్తకం నేను తీసుకోవడం సమస్యవుతుందా?" అన్నాడు శాస్త్రి.

"పుస్తకాలకోసం నేనేమైనా చేయగలను. ఈ చుట్టుపక్కల నాకు చాలా పేరు, పలుకుబడి ఉన్నాయి. నాకు చేరిన ఎవరి పుస్తకమైనా నా పుస్తకమే అవుతుంది. మాటిమాటికీ నా పుస్తకం నా పుస్తకం అని నన్ను రెచ్చగొట్టకు...."

శాస్త్రి చేసేదిలేక తన సమస్య చెప్పుకున్నాడు.

"ఈ మాత్రం దానికి నువ్వింత హడావుడి చేయాలా? నువ్వా అమ్మాయికి చెప్పు నేను తప్పక ఇక్కడ పుస్తకం చదువుకోనిస్తాను. అయితే ఒకరోజు ముందుగా చెప్పాలి" అంది హనుమాయమ్మ.

"ఈ సదుపాయమున్నట్లు శశిరేఖకు తెలియదా?"

"తెలుసో తెలియదో నాకనవసరం. నా దగ్గర పుస్తకాలు చదువుకుందుకు కనుక్కొని వెతుక్కుంటూ వస్తారు" అంది హనుమాయమ్మ.

శాస్త్రి అక్కణ్ణించి సెలవుతీసుకున్నాడు.

3

అంతా విని — "ఏడిచినట్లుంది — ఒక ఆడదానికి భయపడి వెనక్కొచ్చేశావా? నీ పుస్తకం నువ్వు తెచ్చుకోలేకపోతే అది నీకే కాదు, నాకూ అవమానమే! మన మేదో ఒకటి చేయాలి—" అన్నాడు శర్మ.

"పుస్తకాలనామె స్టీలు బీరువాలో ఉంచింది. అన్నింటికీ తాళాలున్నాయి ఆమె యింట్లో దొంగ ప్రవేశిస్తే వెంటనే పోలీసుస్టేషన్లో తెలుస్తుంది...."

"అయితే మాత్రం?" అన్నాడు శర్మ.

"చూడు శర్మా! చూస్తూ చూస్తూ పుస్తకాలకోసం యెవరూ జైలుపాలు కావాలనుకోడు. ఆమె యింట్లో పుస్తకాలు తప్ప ఇంకేమీ లేవు. ఆమె ఏ నేరస్థురాలో అయితే అంతు తేల్చేద్దును. కానీ పుస్తకాలు సేకరిస్తూన్న నేరానికామెపైన పగబట్టలేను. నిజానికి పుస్తకం నా దగ్గరకంటే ఆమెవద్ద ఉండడమే ప్రయోజనకరం. పదిమందీ చదువుతున్నారు...."

"అదే—అదే పెద్ద ప్రమాదం. పువ్వులాంటి పుస్తకాన్ని నీలాంటి ఒక్కడితో సరిపెట్టక ఎందరిచేతనో చదివిస్తోందామె. లాభంలేదు....ఆమె గ్రంథాలయాన్ని పట్టుపట్టాలి..." అన్నాడు శర్మ.

"ఇందుకు నేను నీకు సహకరించను...." అన్నాడు శాస్త్రి.

"నీ సహకారంతో నాకు నిమిత్తంలేదు.." అన్నాడు

శర్మ.

రాత్రి భోజనాలు చేసి మిత్రులిద్దరూ పడుకున్నారు. ఒక రాత్రివేళ లేచిచూస్తే శాస్త్రికి గదిలో శర్మ కన పడలేదు.

తలుపులు దగ్గరగావేసి ఉన్నాయి.

4

తెల్లవారినా శర్మ గదికి తిరిగిరాలేదు. అతడు హనుమా యమ్మ ఇంటికే వెళ్ళి ఉంటాడని ఊహించినా యింత సేపూ ఏం చేస్తున్నాడో శాస్త్రికి తెలియలేదు. అయితే హనుమాయమ్మ చేతిలో శర్మకు ప్రమాదం మాత్రముండ దని అతడి నమ్మకం. అందువల్ల అతడు తన మిత్రుడి గురించి ఆలోచించడం మాని శశిరేఖ విషయమై దృష్టి కేంద్రీకరించాడు.

ఎదురిల్లే శశిరేఖది.

ఎత్తయగల యిల్లది.

ఆ యింటి అరుగుమీద శశిరేఖ అన్న కూర్చుని ఉంటాడు.

అతడిది ఆరడుగుల విగ్రహం. కండలుతిరిగి ఉంటాడు. మనిషి శశిరేఖకంటే బాగుంటాడు కానీ కోపిష్టి. తీరి కూర్చుని దారిపోయేవాళ్ళతో గొడవ పెట్టుకుంటాడు. అందులో సగం గొడవ తన చెల్లెలి గురించే!

చాలామంది శశిరేఖవైపు కన్నెత్తి చూడ్డానికి భయ పడతారంటే అందుకా అన్నే కారణం.

శాస్త్రికూడా శశిరేఖను బొత్తిగా పట్టించుకోకపోవ డానికి ఆ అన్నే కారణం. లేకపోతే అతడికాడపిల్లల్ని పలకరించి కబుర్లు చెప్పడం సరదాయే! అందులో తప్పుందని అతడనుకోడు. మనసులో దురుద్దేశం లేనప్పుడు

అవతలివాళ్ళను మోసం చేయనప్పుడు-ఆడపిల్లతో స్నేహం చేయడంలో తప్పేముంది.

చెప్పాలంటే శాస్త్రి శశిరేఖ అన్న కండల్ని చూసి భయపడ్డంలేదు. క్షణాలమీద అతణ్ని మట్టి కరిపించగలనని అతడి నమ్మకం. అతడు భయపడుతున్నది ఆమె అన్న నోటికి. ఆ నోటివల్ల తను నలుగురి నోళ్ళలోనూ పడాల్సివస్తుంది.

వ్రాళ్ళు బుద్ధిమంతులని ఆ చుట్టుపక్కల వాళ్ళకు పేరుంది. ఆ పేరు పోగొట్టుకోవడం అతడికిష్టంలేదు. అదీ ఈ తిప్పణ్యానికి.

ఆరోజు కూడా శశిరేఖ అన్న కూర్చుని ఉన్నాడు-ఇంటి అరుగుమీద!

శశిరేఖనెలా కలుసుకోవాలా అని చూస్తున్నాడు శాస్త్రి.

అన్న అరుగుమీదుండగా ఆమె కిటికీవద్దకూడా రాదు.

శాస్త్రి త్వరగా కాలకృత్యాలు తీర్చుకున్నాడు.

సరిగ్గా తొమ్మిదింటికి శశిరేఖ బయటకు వస్తుంది. అదామె కాలేజీకి బయల్దేరే సమయం. ఆమె బయల్దేరాక తను బయల్దేరితే శశిరేఖ అన్న అతడిని ఆపి కబుర్లు మొదలు పెడతాడు.

లోకంలో వ్రాళ్ళందరికీ తన చెల్లెలి వెంటపడడమే పని అనీ—వాళ్ళనెలాగో అలా ఆపడానికే తనున్నాడనీ శశిరేఖ అన్న భావిస్తాడు.

అందుకే శాస్త్రి తొమ్మిదికైదునిముషాలుండగానే ఇంట్లోంచి బైటకు వచ్చాడు. ఆ వీధి దాటి శశిరేఖ వెళ్ళే దారిలో కాశాడు.

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు!

కాసేపటికి శశిరేఖ ఆ దారిలో వచ్చింది.

శాస్త్రి వెంటనే ఆమెను కలుసుకోలేదు. మరో సందు మళ్ళేదాకా ఆగి అతడామెను పలకరించాడు.

శశిరేఖ గాబరాపడి చుట్టూ చూసింది.

ఆ వీధిలో జనమాట్టే లేరు. కానీ అలా మాట్లాడు కోవడం ఆమెకిష్టం లేదని శాస్త్రి గ్రహించి—"ఒక్క అయిదు నిమిషాలు-పక్క వీధిలో పార్కుంది. వస్తారా?" అన్నాడు.

ఆమె బదులివ్వలేదు. పక్క వీధిలోకి తిరిగింది.

కాసేపట్లో యిద్దరూ పార్కులో ఉన్నారు.

"చెప్పండి!" అంది శశిరేఖ బెదురుగా.

"మీరు వణుకుతున్నారు. నాకేమో నేను తుంటరి వాడిలా కనబడుతున్నానా అని బెంగగా ఉంది—" అన్నాడు శాస్త్రి.

శశిరేఖ కిసుక్కున నవ్వి—"నా భయం అన్నయ్య గురించి. నేనిలా కలుసుకుని మీతో మాట్లాడినట్లు తెలిసిందంటే—వాడు నానారభసా చేసాడు—" అంది.

"అన్నయ్య భయంలేకపోతే నాతో మాట్లాడ్డానికి మీకిష్టంలేదా?" అన్నాడు శాస్త్రి.

"కాబట్టే నిన్న సాయంత్రం నేను బీచిలో మాట్లా లేను—"

"సాయంత్రాలెందుకు మీ అన్నయ్య భయముండదు?"

"ఎందుకంటే వాడు సాయంత్రాలు పుస్తకాలు చదువుకుంటాడు కాబట్టి!" అంది శశిరేఖ.

"ఎక్కడ?"

"హనుమాయమ్మ గారింట్లో—...."

శాస్త్రి తెల్లబోయి — "హనుమాయమ్మగారింట్లో పుస్తకాలు చదువుకునే సదుపాయముందని మీకు తెలుసా?" అన్నాడు.

"తెలియకేం—" అంది శశిరేఖ.

"ఇది చెబుదామనే నేను మీ దగ్గరకు వచ్చాను. పుష్ప ఆవిడింట్లో ఉంది. మీరక్కడికి వెళ్ళి చదువుకో వచ్చు—...."

"కుదరదు...." అంది శశిరేఖ.

"ఎందుకని?"

"అన్నయ్య నన్నక్కడికి వెళ్ళొద్దని ఖచ్చితంగా చెప్పేశాడు ..."

"ఎందుకట?"

"ఎందుకని అడగడానికి వీల్లేదు. వాడు చెప్పినట్లు చేయాల్సిందే—"

"చిత్రంగా ఉందే—" అంటూ శాస్త్రి ఆమెకు హనుమాయమ్మింట్లో జరిగింది చెప్పి—"మీరక్కడకు వెళ్ళి చదువుకోవడంలో తప్పులేదని నాకనిపించింది—" అన్నాడు.

"అయితే నాకాపుస్తకం తెచ్చిపెట్టడం మీవల్ల కాదంటారు!"

శాస్త్రి ఆమెవైపు చూశాడు. నిరుత్సాహం ఆమె కళ్ళలో కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

"ఎందుకు కుదరదు? కానీ...." అతడాగాడు.

శశిరేఖ కూడా సాలోచనగా—"ఒక పని చేద్దాం. సాయంత్రం మీరు బీచికి రండి. నిన్నటిచోటే మళ్ళీ కలుసుకుందాం—" అంది.

"ఎందుకు? అన్నాడు శాస్త్రి.

"పుర్వ్వ గురించి మాట్లాడుకుందాం...."

"ఎందుకు?"

"ఒక మంచి నవల గురించి మాట్లాడుకుందామంటే ఎందుకంటారేమిటి? మీరు నిజంగా కిరణ్మయి అభిమాను రాలేనా?" అంది శశిరేఖ చిరాగ్గా.

"మీరిలా రమ్మన్నారు కాబట్టి కిరణ్మయి అభిమానినే—"

"నవల చదివే అవకాశం లేదింక. ఆ నవల మొదట్నుంచి చివరిదాకా గుర్తుంది నాకు. ఇద్దరం నవలగురించి మాట్లాడుకుంటూ మర్చిపోయినవి గుర్తుచేసుకుంటూంటే చాలా గొప్ప అనుభవం—"

"అలాంటి అనుభవం యింతవరకూ నాకూ లేదు—"

"నేనూ, హేమలతా ఇలా నవలల గురించి చర్చించుకునేవాళ్ళం. ఇప్పుడు వాళ్ళ నాన్నకు ట్రాన్స్‌ఫరై ఇంకో ఊరెళ్ళిపోయిందది. ఇన్నాళ్ళకి మీరు దొరికారు."

"థాంక్స్—" అన్నాడు శాస్త్రి.

ఇద్దరూ అప్పటికి విడిపోయారు.

5

మధ్యాహ్నం, సాయంత్రం గడిచిపోయినా శర్మ ఇంటికి రాలేదు. శాస్త్రి కాస్త కలవరపడ్డాడు కానీ బీచివద్ద శశిరేఖను కలుసుకొని మాట్లాడబోతున్నానన్న మధురోహ అతడిని చాలావరకూ మరిపించింది.

అనుకున్న ప్రకారం ఇద్దరూ బీచివద్ద కలుసుకున్నారు. సంభాషణ చాలాసేపు నవల గురించే నడిచింది.

శాస్త్రికి విసుగ్గా వచ్చి "నవల గొప్పదే కానీ ఇంక దాని గురించి మాట్లాడాలని లేదు—" అన్నాడు.

"ఎందుకని?"

"నవల గురించి ఆలోచించడంకంటె మీతో మాట్లాడుతూంటే ఆ అనుభవం చాలా గొప్పగా ఉంది. నాకు మీ గురించి తెలుసుకోవాలనుంది...."

శశిరేఖ అతడివంక అదోలా చూసి—"ఈ విషయం ఇంత ఆలస్యంగా చెప్పారేం?" అంది.

"మిమ్మల్ని నిరుత్సాహపర్చడం యిష్టంలేక!"

"నిజానికి మీరు నవల గురించి మాట్లాడుతున్నప్పుడే నేను నిరుత్సాహపడ్డాను. టాపిక్ మారితే బాగుండునని నాకూ అనిపించింది—...."

శాస్త్రి ఆశ్చర్యంగా—"నిజంగా?" అన్నాడు.

"ఊఁ" అంది శశిరేఖ.

"అయితే మనం టాపిక్ మార్చాలి...."

"మీరే మంచి టాపిక్ చెప్పండి..."

"యువతీయువకులకు మంచి టాపిక్ ఒక్కటే—ప్రేమ!"

"అదే చెప్పండి—" అంది శశిరేఖ.

"ప్రేమ చాలా గొప్పది. ప్రేమ అద్భుతమైనది. ప్రేమను మించినదేదీ ఈ ప్రపంచంలో లేదు—...."

"ప్రేమ ఎలా ఉంటుందో చెప్పరూ?" అంది శశిరేఖ.

"అద్దంముందు నిలబడాలి...." అన్నాడు శాస్త్రి.

"ఛీ—...." అంది శశిరేఖ.

"ఏమయింది?" అన్నాడు శాస్త్రి కంగారుగా.

"మీరన్నీ పువ్వుల్లో డైలాగులే చెబుతున్నారు. హీరోవైతే ఫరవాలేదు విలనువి చెబుతున్నారు. ఈ డైలాగు చెప్పి విలన్ హీరోయిన్ని మోసం చేస్తాడు. గుర్తులేదా?" అంది శశిరేఖ.

"అవునవును. పొరపాటైపోయింది...." అన్నాడు

శాస్త్రి.

"పొరపాటు దిద్దుకోం!...."

శశిరేఖవైపు సూటిగా చూశాడు శాస్త్రి. ఆమె ఆరాధనాభావంతో అతడివంక చూస్తోంది. శాస్త్రి వెంటవెంటనే భయం భయంగా—"మీరు కొంపదీసి నిజంగా నన్ను ప్రేమిస్తున్నారా?" అన్నాడు.

"ఏం—ప్రేమిస్తే తప్పా?"

"ప్రేమించడం తప్పుకాదు. కానీ నన్ను ప్రేమించడం...." శాస్త్రి తన్నుతాను చిన్నబుచ్చుకోలేక నసిగాడు.

"మీరు అచ్చం పుస్తకంలో హీరోలా ఉన్నారు. మీకు గుర్తుందో లేదో పుస్తకంలో హీరోయిన్ ఎదురుగా ఉన్న హీరోను గుర్తించక మోసగాడైన విలన్ చుట్టూ తిరిగి ఆలస్యంగా తన తప్పు గ్రహిస్తుంది. నేనా నవల చదివాను కాబట్టి అలాంటి తప్పు చేయను. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. నా ప్రేమను మీరు కాదనకండి...."

శాస్త్రి తెల్లబోయి—"అయాం సారీ శశిరేఖా! ఇప్పట్లో పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యం నాకు లేదు—" అన్నాడు.

"మీకోసం యెంతకాలమైనా ఆగుతాను—" అంది శశిరేఖ.

"అయితే మరొక్కరోజు ఆగండి. నా నిర్ణయం చెబుతాను—...." అన్నాడు శాస్త్రి.

ఆ రోజుకిద్దరూ విడిపోయారు.

6

శర్మ ఒక్కడూ ఉన్నాడాకదిలో—అతడు మాటి మాటికీ పైకు చూసుకుంటున్నాడు.

రాత్రి అతడు హనుమాయమ్మింట్లో చొరబడ్డాడు. ఓ గదిలో దూరగానే తలుపులు మూసుకున్నాయి. తెరవడం అతడివల్ల కాలేదు.

గదికి అటాచ్డ్ బాత్ ఉంది.

అతడు కాలకృత్యాలు తీర్చుకొని వచ్చేసరికి గదిలో ఉతికిన బట్టలు, టిఫిను సిద్ధంగా ఉన్నాయి.

ఆశ్చర్యపడుతూనే తిన్నాడతడు.

తలుపు తెరవకుండానే చిన్న సందులోంచి మధ్యాహ్న భోజనంకూడా అతడికందింది.

అక్కడ తన నెవరు యెందుకు బందీచేశారో అతడి కర్థంకాలేదు. అలాగే ఆ గదిలో సాయంత్రందాకా కాలక్షేపం చేశాడు.

ఇప్పుడు సమయం అయిదుగంటలు.

ఉన్నట్లుండి గది తలుపులు తెరుచుకున్నాయి.

లోపలకు హనుమాయమ్మ వచ్చింది.

"మీరేనా నన్ను బందీని చేశారు!" అన్నాడు శర్మ ఆశ్చర్యంగా.

"అవును—" అంది హనుమాయమ్మ.

"ఎందుకు?"

"నువ్విక్కడికెందుకొచ్చావో చెప్పు—"

శర్మ చెప్పాడు.

"నాకు తెలుసు—అందుకే నిన్ను బందీని చేశాను."

"నా గురించి మీకెలా తెలుసు?"

"రమ చెప్పింది...."

"రమ ఎవరు?"

"నిన్ను ప్రేమించిన అమ్మాయి...."

శర్మ కాసేపాలోచించాడు. రమ అతడికి గుర్తొచ్చింది. బజార్లో తనామెను చాలాసార్లు చూశాడు. ఒకసారి తనే శర్మను పలకరించింది. అభిమానం ఒలకబోసింది. శర్మకామెతీరు నచ్చలేదు.

"రమ మీకెలా తెలుసు?" అన్నాడు శర్మ.

"ప్రేమికులను దగ్గర చేసే ఉపాయం నాకు తెలుసు" అంది వానమామయమ్మ.

"అంటే?"

"వయసులో స్త్రీ పురుషులకు పరస్పరం తోడు కావాలి. అందుకే పెద్దలు పెళ్ళి ఏర్పాటు చేశారు. ఒకనాడీ పెళ్ళిళ్ళు పెద్దలు నిర్ణయించేవారు. వారి నిర్ణయాల వెనుక అంతులేని అనుభవముండేది. అందువల్ల ఆ పెళ్ళిళ్ళు జయప్రదమయ్యేవి. ఇప్పుడు పూర్వంమీద కుర్రాళ్ళు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. చాలామంది తమ పెళ్ళిళ్ళు తామే నిర్ణయించుకుంటున్నారు. కానీ అనుభవం లేక తొలిచూపుల్లో నే యేర్పడిన అభిప్రాయాలకు కట్టుబడిపోతున్నారు. ఆ తర్వాత పెళ్ళిళ్ళు దెబ్బతింటున్నాయి. అందుకని నేను మా యింట్లో పెళ్ళికిముందే ప్రేమికులు కలుసుకునే యేర్పాటు చేస్తున్నాను...." అందామె.

"ఎలా?" అన్నాడు శర్మ.

"ఈ రోజుల్లో యువతరానికి పుస్తకాలంటే పెద్ద క్రేజ్ వుంది. కబుర్లెన్ని చెప్పినా వాటి ఖరీదు చాలా ఎక్కువ కాబట్టి కొని చదవగలవారి సంఖ్య తక్కువ. ఎక్కడా దొరకని పుస్తకాలు నేను ముందు కొనేస్తాను. ఇతరులక్కడా దొరక్కండా నేను వాటిని సేకరిస్తాను. పుస్తకాలు చదవడానికి అద్దెకూడా లేదు. అందువల్ల

చాలామంది నా దగ్గరకు పుస్తకాలు చదువుకుందుకు వస్తారు. ఆ వచ్చేవారిలో ఆడపిల్ల లెక్కువ..." అని ఆగింది హనుమాయమ్మ.

"అయితే?" అన్నాడు శర్మ.

"ప్రతి ఆడపిల్లకూ కొందరు ప్రేమికులుంటారు. వాళ్ళలో కొందరినామె పలకరిస్తుంది. కొందర్ని చూడగానే చీదరించుకుంటుంది. అలా చీదరించుకోబడ్డ వాళ్ళు నన్నాశ్రయిస్తారు. నేను వారి దగ్గర ఫీజు తీసుకుంటాను. వారికా అమ్మాయితో మాట్లాడే అవకాశం కలగ చేస్తాను...."

"అదెలా?"

"పుస్తకాలు చదువుకుందుకు పదహారు ప్రత్యేకమైన గదులున్నాయీ యింట్లో — ఒకో గదిలో ఒకో పిల్ల మాత్రమే ఉంటుంది. చదువుకుందుకు గంటమాత్రం టైము. సరిగ్గా నలభై నిముషాలయ్యాక ఆమె గదిలోకి ప్రియుణ్ని పంపిస్తాను—" అంది హనుమాయమ్మ.

"ఇది చాలా ఘోరం. పుస్తకాల పేరుతో మీరిక్కడ వ్యభిచారం నడుపుతున్నారన్నమాట...." అన్నాడు శర్మ కోపంగా.

"తొందరపడి తప్పుగా అర్థం చేసుకోకు. ఇక్కడ కుర్రాళ్ళు మర్యాద మితిమీరితే మక్కెలిరగదన్న డానికేర్పాటుంది. నేను ముందుగానే కుర్రాడి మంచి చెడ్డలు విచారిస్తాను. అప్పుడే లోపలకు పంపుతాను...."

"అమ్మాయిందుకొప్పుకుంటుందా?" అనడిగాడు శర్మ.

"ఆడపిల్లలకీరోజుల్లో వున్న పుస్తకాల పిచ్చి గురించి నీకు తెలియదులే....అవి చదవడం కోసం ఇష్టం లేని మనిషితో కాసేపు మాట్లాడ్డానికి వాళ్ళకభ్యంతర

ముండదు. ఎలాగో అలా నవల పూర్తి చేయాలి. అదీ వారి ధ్యేయం. ఆ విధంగా రోజుకిరవై నియమాలు ఇష్టంలేని మనిషితో సంభాషించేసరికి—ఒకరినొకరు సరిగ్గా అర్థం చేసుకోవడం జరుగుతుంది. ఆ విధంగా గత నాలుగేళ్ళలోనూ నలభై జంటలు పెళ్ళిళ్ళు చేసుకున్నాయి. ఆరుగురు జంటలు కావాలనుకుని మనసు మార్చుకున్నారు. యువతరానికి నా గ్రంథాలయం ఒక వరం...." అంది హనుమాయమ్మ.

"ఇది బయటివారికి తెలిస్తే?"

"ఊరికే పుస్తకాలు చదువుకోనిస్తాను. అందువల్ల పుస్తకాలు చదువుకుందుకు చాలామంది ఆకర్షితులవుతున్నారు. సాధారణంగా యువతీ యువకులు ఇక్కడ జరిగే విశేషం బయటకు చెప్పుకోరు. చెప్పుకున్నా దానికి ప్రచారంరాదు. ప్రచారం వచ్చినా అందుకు ఋజువుండదు. ఇక్కడ అవినీతికి తావులేదు. యువతీ యువకుల పుస్తకాల క్రేజ్—బలహీనతగా మారితే అది నేనుపయోగించుకొని వారిలో పరస్పరావగాహనకు సహకరిస్తున్నాను. అందువల్ల ఆర్థికంగా కంటె మానసికంగా నాకు లభిస్తున్న తృప్తి ఎక్కువ" అంది హనుమాయమ్మ.

"ఆడపిల్లలకు పుస్తకాలపట్ల క్రేజ్ ఉన్నమాట నిజమా?" అన్నాడు శర్మ నమ్మలేనట్లు.

"క్రేజ్ మాత్రమే కాదు. నవలలవల్ల వారు ప్రభావితులై అందులోని పాత్రల్లా ప్రవర్తించాలనుకుంటున్నారు. చూసిన మనిషి గురించి యేమేమో ఊహించుకుని తప్పుడు అభిప్రాయాలకు గురవుతున్నారు. ఊహాలోని మనిషిని వాస్తవంలోకి తీసుకువచ్చి యథార్థాన్ని వారికి తెలియచెప్పడానిక్కూడా నా గ్రంథాలయం ఉపయోగ

పడుతోంది. ఆ విధంగానే రమ అనే అమ్మాయి నిన్ను ప్రేమిస్తే నీకు పుస్తకాల క్రేజ్ లేకపోవడంవల్ల ఇక్కడకు రప్పించలేకపోయాను. శశిరేఖ అనే అమ్మాయి నీ స్నేహితుణ్ని ప్రేమిస్తే ఇక్కడ కుదరక బీచి దగ్గర కలుసుకోమని ఉపాయం చెప్పాను ..."

"అంటే శశిరేఖ మీ సలహామీదే మా శాస్త్రిని పలకరించిందన్నమాట.... అయితే శాస్త్రికి పుస్తకాల పిచ్చివుంది. ఇక్కడెందుకు కుదరదన్నాడు?"

"శశిరేఖ అన్న నలుగురమ్మాయిలతో స్నేహాంకోరి తరచు యిక్కడికి వస్తున్నాడు. ఆ నలుగురిలో తన అభిరుచులకు తగిన అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలని అతడనుకుంటున్నాడు. ఇక్కడికి అమ్మాయిలువస్తే వారిని కలుసుకోగోరే అబ్బాయిలుంటారనీ — అబ్బాయిలువస్తే వారిని కలుసుకోగోరే అమ్మాయిలుంటారనీ అతడికి తెలుసు. అందుకే తన చెల్లెల్నిక్కడకు రానివ్వకుండా కట్టుదిట్టం చేస్తున్నాడు. ఆ అమ్మాయి కాలేజీనుంచి ఫోన్ చేసి నా సలహా అడిగింది.." అంది హానమాయమ్మ.

"మీరు నిజమే చెబుతున్నారా?" అన్నాడు శర్మ.

హానుమాయమ్మ అతడికో చిన్న కాగితం యిచ్చి—"ఇందులో ఆరు అడ్రసులున్నాయి. అన్నీ ఈ ఊరివే! నువ్వు వారింటికి వెళ్ళి నా గురించి అడిగి తెలుసుకో— వారింట్లో నా ఫోటో ఒకటి ఉంటుంది దానికి పూజ కూడా చేస్తూంటారు వాళ్ళు ..." అంది.

"చాలా చిత్రంగా ఉంది—" అన్నాడు శర్మ.

"ఒక రోజంతా నిన్ను బందీగా ఉంచినందుకు నన్ను మన్నించు. ఆమాత్రం శిక్ష లేకపోతే మళ్ళీ మళ్ళీ నా

యింట్లో మారాలన్న సరదా పుట్టవచ్చునుగదా!" అంది హనుమాయమ్మ.

"నేనీ అడ్రసులకు వెడతాను. మీ గురించి తెలుసుకుంటాను. మీరు చెప్పిందే నిజమైతే వచ్చి మీకు సాష్టాంగపడి వెడతాను. లేకూ మీ గ్రంథాలయాన్ని సర్వనాశనం చేస్తాను...." అన్నాడు శర్మ.

"నీ ప్రతాపం ఇంతవరకూ చూశానుగా—" అంది హనుమాయమ్మ.

"బ్రహ్మాస్త్రానికి కట్టుబడ్డాడని ఆంజనేయుణ్ని వేళాకోళం చేస్తే నష్టపోయినదెవరు? నాకు మీపై నిజంగా ఆగ్రహం వచ్చేవరకూ మీరు నా అసలైన ప్రతాపం చూసినట్లు కాదు—" అన్నాడు శర్మ.

"అయితే యిప్పుడే సాష్టాంగపడి వెళ్ళు. మళ్ళీ యిక్కడకు రావాల్సిన పని ఉండదు...." అంది హనుమాయమ్మ.

"ఫరవాలేదు. మళ్ళీ వస్తాను. శ్రమేం లేదు నాకు" అని—"అన్నట్లు మీరు రమ గురించి చెప్పారు. మీ గ్రంథాలయానికి వెళ్ళి పుస్తకాలు చదవమని ఆమె నాకు సలహా యిచ్చింది. ఆ తర్వాత నాకు మళ్ళీ కనబడలేదు- ఆమె యేమయింది?" అనడిగాడు శర్మ.

"ఏమవుతుంది? ఈ ఊళ్ళోనే ఉంది. బొత్తిగా పుస్తకాలు చదివే అభిరుచి లేనివాణ్ని ప్రేమించడం పెద్ద తప్పని గ్రహించి నిన్ను మనసులోంచి తుడిచి పెట్టేసింది!" అంది హనుమాయమ్మ.

సరిగ్గా మూడుగంటల తర్వాత శర్మ తిరిగివచ్చి హనుమాయమ్మకు పాదాభివందనం చేసి వెళ్ళాడు.

శర్మ భోంచేసి గది చేరుకొనేసరికి రాత్రి తొమ్మిదిన్నర దాటింది. గదిలో శాస్త్రి లేడు.

"ఏమయ్యాడు చెప్మా?" అనుకున్నాడతడు.

కానీ శాస్త్రినిమించి రమ గురించిన ఆలోచన లతనిలో ఎక్కువగా చోటు చేసుకున్నాయి.

ఆమె తనను ప్రేమించింది. బాగా పుస్తకాలు చదివే అభిరుచి లేనందుకు తన్ను మర్చిపోవాలనుకుంది.

రమ అందంగా ఉంటుంది.

ఈ వయసులో స్త్రీ పురుషులకు పరస్పరం తోడు కావాలి.

తను రమను నిర్లక్ష్యంచేసి పొరపాటు చేశాడా?

తనలో చాలా లోపాలున్నాయి. ముఖ్యంగా పుస్తకాలంటే అభిరుచి లేకపోవడం....

పుస్తకాలు యువతరాన్ని ప్రభావితం చేస్తున్నాయంటే అవి చాలా గొప్పవై ఉండాలి....

తెలుగు నవల్లు గొప్పవి.

అవిప్పుడు వారానికి బోలెడు కొత్తవి రిలీజవుతున్నాయి. సినిమాలుగా వస్తున్నాయి. రచయితలకు ప్రచారం తెచ్చిపెడుతున్నాయి.

అవి తనెందుకాకర్షించలేదు?

తను తనలోని లోపాన్ని సవరించుకోవాలి....

రేపట్నుంచే హనుమాయమ్మ గ్రంథాలయానికి వెళ్లాలి.

శర్మ ఆలోచిస్తూండగానే గది తలుపు కొట్టాడు శాస్త్రి.

శర్మ లేచివెళ్ళి తలుపుతీశాడు.

శాస్త్రి ఉత్సాహంగా వున్నాడు.

"శాస్త్రీ! నువ్వు సంతోషించే వార్త నేనొకటి చెబుతాను...." అన్నాడు శర్మ.

"నేనూ నీకొకటి చెప్పాలి—" అన్నాడు శాస్త్రి.

"చెప్పు—" అన్నాడు శర్మ.

"ముందు నువ్వే చెప్పు..." అన్నాడు శాస్త్రి.

శర్మ నవలల గురించి తన అభిప్రాయాలు మారినట్లు చెప్పాడు.

"ఇంతకాలం నేను తప్పుదారిలో ఉన్నాను. నువ్వూ ఆ దారికి రావు శర్మా! నవలలు యువతరాన్ని పాడు చేస్తున్నాయి...." అన్నాడు శాస్త్రి.

'అవి మనుషుల్లో ప్రేమభావాలు మొలకెత్తిస్తున్నాయి. అది తప్పా?"

"తప్పే మరి! నవలలు చదివి శశిరేఖవంటి వాళ్ళు నావంటి వాళ్ళని ప్రేమిస్తున్నారు...."

"ఏం—నీకేం తక్కువ?"

"పువ్వు నవల చదివి అందులో హీరోతో నన్ను పోల్చుకుంటోంది శశిరేఖ. ఆ హీరోకూ నాకూ బొత్తిగా పోసగదని ఆమెకు తెలియదు. ఆ నవల్లో నాకు హీరోయిన్ నచ్చింది. హీరో బొత్తిగా నచ్చలేదు. ఇంకా చెప్పాలంటే నేనింకా పెళ్ళికి మానసికంగా సిద్ధంకాని మగాణ్ణి. కొంతకాలంపాటు పవిత్రత గురించి పట్టించుకోకూడదనే మగాణ్ణి. అదృష్టవశాత్తూ మోసంచేయాలనే దుర్బుద్ధి లేదుకానీ అవకాశంవస్తే యెలా మారతానో! నవలల పేరు చెప్పి శశిరేఖ నాకా అవకాశమిచ్చినా ఆశ్చర్యంలేదు. అయినా నావంటివాణ్ణి శశిలేఖ ప్రేమించడమా—ఇది నవలల ప్రభావమే కదూ! అసలామెకు ప్రేమ ఎందుకు? తలిదండ్రులు నిర్ణయించినవాణ్ణి చేసుకో

వచ్చుగా. ఆమెకి పట్టుమని పద్దెనిమిదేళ్లుకూడా ఉండవు" అన్నాడు శాస్త్రి.

శర్మ ఆశ్చర్యంగా — "మనిద్దరిపీ యెప్పటికీ భిన్న ధృవాలే ఏమో—అందుకే ఈ పరస్పరాకర్షణ.... ఇంతకీ నిన్ను శశిరేఖ ప్రేమిస్తోంది—ఏం చేస్తావు?" అన్నాడు.

"రాత్రికి రాత్రి మన మీ యిల్లు ఖాళీ చేసేస్తున్నాం. నేను పాత ఇంటాయనకి పాత బాకీ తీర్చేసి—ఓ నెల అద్దెన్నకూడా యిచ్చి వస్తున్నాను. అయినా కాకా పట్టి అవిణ్ని ఆకాశానికి తేసి పని సాధించుకొని రావడానికింత సేపు పట్టింది. వాళ్ళు యింట్లోకి మన అదృష్టం కొద్దీ ఇంకా ఎవరూ రాలేదు...." అన్నాడు శాస్త్రి.

మిత్రులిద్దరూ ప్రేమకూ, మానుమాయమ్మ గ్రంథాలయానికీ దూరంగా ఆ రాత్రే ప్రయాణమయ్యారు.

—: అయిపోయింది :—